క్లుప్తంగా

'దివ్యాంగుల' గౌరవాధ్యక్ష పదవికి వంటెద్దు రాజీనామా

అమలాపురం టౌన్: జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడిగా గత ఐదేళ్లగా పనిచేస్తున్న వంటెద్దు వెంకన్నాయుడు ఆ పదవికి రాజీనామా చేశారు. పని ఒత్తిడి, వ్యక్తిగత కారణాల వల్ల పదవికి రాజీనామా చేసినట్టు అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకన్నాయుడు తెలిపారు. తాను రాజీనామా చేసినా ఎప్పటిలాగే జిల్లా దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని, ఎప్పుడు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. జిల్లాలో దివ్యాంగులకు అండగా నిలిచే వెంకన్నాయుడు ఇలా రాజీనామా చేయడం తమకు తీరని లోటనేనని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగవరపు పరశురాముడు ఆందోళన వ్యక్తం చేశారు.

ఎంపీపీ పాఠశాల విలీనాన్ని నిలిపివేయండి

అల్లవరం: డి.రావులపాలెం పంచాయతీ పరిధిలోని సావరంపేట ఎంపీపీ పాఠశాలను మోడల్ స్కూల్లోని విలీనం చేయడానికి విద్యాశాఖ అధికారుల చేస్తున్న ప్రయత్నాలను నిలిపివేయాలని ఆ గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే ఆనందరావును అమలాపురంలోని క్యాంపు కార్యాలయంలో కలసి వినతిపత్రం ఇచ్చారు. సావరం ఎంపీపీ పాఠశాలలో 23 మంది విద్యార్థులు ఉన్నారని, పాఠశాలను ఇక్కడే కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేని కోరారు. సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మోడల్ స్కూల్లో విలీనం చేయడం ద్వారా పిల్లలు రాకపోకలక ఇబ్బంది పడతారని వాపోయారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ఈతకోట కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ నల్లా శ్రీను, నల్లా దుర్గాప్రసాదు, ఈతకోట శ్రీను, కాశి సత్యనారాయణ, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీరేశ్వర స్వామిని దర్శించిన మైనింగ్ జేడీ

ఐ.పోలవరం: ఆంధ్రప్రదేశ్ మైనింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ డి.శ్రీనివాసరావు దంపతులు ఆదివారం భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి వారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు ప్రత్యేక దర్శనం అందించారు. తొలుత వీరికి ఆలయ పర్యవేక్షణ అధికారి శ్రీనివాస్ రాజు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందించారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అనంతరం జేడీ శ్రీనివాసరావు దంపతులు స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

81 మంది రక్తదానం



రక్త దానం చేస్తున్న దాతలు, పలు సంఘాల నేతలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయం సమీపంలోని గండి పోశమ్మ లే అవుట్‌లో మెగా రక్త దాన శిబిరం ఆదివారం నిర్వహించారు. 81 మంది స్వచ్ఛందంగా రక్త దానం చేశారు. దివంగత దోసూరి అన్నపూర్ణ జయంతి సందర్భంగా ఆమె కుమారుడు దూసూరి కాశీ, ఆయన మిత్ర బృందం ఈ సామాజిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం భారీ అన్నదానం జరిగింది. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను, చెన్న మల్లేశ్వర కళా పరిషత్ ప్రతినిధి నల్లా శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ యాళ్ల నాగ సతీష్, విశ్వ బ్రాహ్మణ జిల్లా సంఘం నాయకుడు దార్ల పాపయ్యాచారి, నల్లా సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ నల్లా పవన్, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, బులినియన్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చింతలపూడి సత్తిబాబు, యువజన నాయకుడు పాల్గొన్నారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్, సహస్ర బ్లడ్ బ్యాంక్ సిబ్బంది దాతలను రక్తాని సేకరించారు.

సత్యనారాయణకు 'ఆక్స్‌ఫర్డ్' నుంచి అవార్డు ప్రదానం



ఫ్రీ రిపబ్లిక్ ఆఫ్ లిబర్లాండ్ అధ్యక్షుడు విట్ జెడ్లికా నుంచి అవార్డు అందుకుంటున్నసత్యనారాయణ

అమలాపురం రూరల్: ప్రభుత్వ బ్యాంకింగ్, విద్యా రంగాలలో పరిశోధనాలు చేసి ఆర్టిషియల్, ఇంటలీజెన్స్ మెషిన్‌లెర్నింగ్ గుర్తించి అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం చెందిన ప్రొఫెసర్ డాక్టర్ వక్కపట్ల వీరవెంకట సత్యనారాయణకు ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీ ఆక్స్‌ఫర్డ్ నుంచి ఐకాన్ ఆఫ్ ఆసియా ఫిన్‌టెక్ ఇన్నోవేటర్ ఆఫ్ ది ఇయర్‌ అవార్డు లభించింది. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ఆక్స్‌ఫర్డ్‌లో ఆష్మోలియన్ మ్యూజియంలో శనివారం జరిగిన వరల్డ్ లీడర్స్ సమ్మిట్‌లో ఈ అవార్డును తీసుకునట్టు సత్యనారాయణ తెలిపారు. ఆర్థిక, ప్రభుత్వ కార్యకలాపాలు, సాంకేతిక రంగాల్లో విశిష్ట నాయకుడిగా ఆవిష్కర్తగా సేవలు అందించినందుకు సత్యనారాయణకు ఐకాన్ ఆఫ్ ఆసియా అవార్డు అందుకున్నారు. ఆయనను గోల్డెన్ వీసాతో సత్కరించారు.

హలీం.. రుచికి గులాం..

- కోనసీమలో హలీం ఘుమఘుమలు
- హైదరాబాద్ వంటగాళ్లతో అమలాపురంలో ప్రత్యేక తయారీ
- రంజాన్‌లో ముస్లింలకు అత్యంత ఇష్టమైన ఇరానీ రుచి
- ఇతరుల సైతం లొట్టలేసుకుని తినే మాంసాహార వంటకం



అమలాపురంలో హలీం తయారీ సెంటరులో కొనుగోలుదారుల సందడి



తినేందుకు నోరూరించే హలీం



ప్రత్యేక పొయ్యిపై హలీంను వండుతున్న దృశ్యం

అమలాపురం టౌన్: రంజాన్ మాసాన్ని ముస్లింలు ఎంత పవిత్రంగా ఆచరిస్తారో అంతే ఇష్టంగా హలీంను రుచి చూస్తారు. నెల రోజుల్లో ప్రతి రోజూ ఉపవాస దీక్షలు చేసే ముస్లింలు బలవర్ధకమైన హలీంను తినేందుకు ఆసక్తి చూపుతారు. ముస్లింలే కాకుండా ఇతరులు కూడా ఈ మాంసాహారంతో పాటు పలు రకాల పప్పులతో తయారు చేసే ఈ వంటకం తినేందుకు లొట్టలేస్తారు. ఈ వంటకం పూర్తిగా ఇరానీ వంటగా తయారవుతుంది. జిల్లా కేంద్రం అమలాపురంలో ముస్లిం షాదీ ఖానా వద్ద హలీం తయారీ కేంద్రం ఏర్పాటు చేయడంతో రోజు సాయంత్రం ఈ వంటశాల వద్ద ముస్లింలతో పాటు ఇతరులు కూడా చేరి హలీం తినేందుకు ఎగబడుతున్నారు.

రంజాన్ వేళ బలిష్టమైన ఆహారం హలీం

రంజాన్ నెల రాగానే బలిష్టమైన ఆహారంగా హలీంను భావిస్తారు. గోధుమ, జీడిపప్పు, బాదం, పిస్తా, నాలుగు రకాల పప్పులతో పాటు మేక మాంసం (మటన్)తో హలీంను ప్రత్యేక వంటగాళ్లు తయారు చేస్తారు. ఈ వంటను సాధారణ వంటగాళ్లు చేయలేరు. ప్రత్యేక తర్ఫీదు ఉన్న వారు మాత్రమే హలీం తయారీలో నిమగ్నమవుతారు. అమలాపురంలో ఏర్పాటైన ఈ వంటకం తయారీతో కోనసీమ వ్యాప్తంగా హలీం ఘుమఘుమలు వెదజల్లుతున్నాయి.

హైదరాబాద్ బావర్చీలతో ఇరానీ వంటకం

అమలాపురంలో రంజాన్ నెల సందర్భంగా ఎ-1 రంజాన్ స్పెషల్ ప్యూర్ హైదరాబాదీ హలీమ్ పేరుతో తయారీ సెంటరును నెలకొల్పారు. మహ్మద్ ఆషిక్ అలీ(మున్నా) ఈ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి రోజూ మటన్, చికెన్‌తో కూడిన హలీంను తయారు చేస్తున్నారు. ఈ హలీం సెంటరు ఏర్పాటు కోసం హైదరాబాద్ నుంచి ప్రత్యేకించి నలుగురి బావర్చీలను (వంట మేస్త్రీలు) అమలాపురానికి తీసుకుని వచ్చి వారి చేత రోజూ వండిస్తున్నారు. దీని తయారీకి ప్రత్యేక పొయ్యిని ఏర్పాటు చేశారు. ఆ పొయ్యిపైనే ఘుమ ఘుమలాడే హలీంను రోజూ ప్రత్యేక వంటకంగా తయారు చేస్తున్నారు. నూనెతో కాకుండా పూర్తిగా నెయ్యితో ఈ వంటనాన్ని తయారు చేస్తున్నారు. అందుకే హలీంను నెయ్యితోపాటు పలు డ్రై ఫ్రూట్స్, పప్పులు, గోధుమ, మటన్, చికెన్‌లతో తయారు చేయడమే వల్లే దానికి అంతటి అరుదైన రుచి వస్తోంది. రోజూ సాయంత్రం అయ్యే సరికి అమలాపురం హలీం తయారీ సెంటరుకు ఆర్డర్లు అంత అధికంగా వస్తున్నాయి. ఈ సెంటరులో తినే సదుపాయంతో పాటు పార్శిల్ సర్వీస్ కూడా అందుబాటులో ఉంచారు.

రంజాన్‌లో హలీం తినడం ఓ అనుభూతి



రంజాన్‌లో హలీంను తినడం మాంసాహార ప్రియులు ఓ అనుభూతిగా భావిస్తారు. రంజాన్‌లో రోజంతా కఠిక ఉపవాసం చేసే ముస్లింలకు హలీం బలాన్ని ఇచ్చే ఆయుధంగా ఈ ఆహారాన్ని భుజించడం ఆనవాయితీగా వస్తోంది. ఏడాదిలో ఈ నెలలో ఎన్నో పోషక విలువలున్న హలీంను తినేందుకు ముస్లింలే కాదు ఇతరులు కూడా మా సెంటరుకు వస్తున్నారు. హైదరాబాద్ నుంచి నలుగురి బావర్చీలతో ప్రత్యేరించి రుచిలో ఎక్కడా రాజీ పడకుండా వండిస్తున్నాం.

– మహ్మద్ ఆషిక్ అలీ, యాజమాని, హలీం తయారీ సెంటరు, అమలాపురం

సామాజిక సేవలో నిరంతరం నిమగ్నం



పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు దంపతులను అభినందిస్తున్న సభ్యులు

యానాం: సామాజికసేవలో నిరంతరం నిమగ్నం కావడం ద్వారా పేద వర్గాలకు కావాల్సిన అవసరాలు, సహాయ సహకారాలు అందించడానికి ఆస్కారం ఉంటుందని ఆ విధంగా లయన్స్‌క్లబ్ సభ్యులు సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలని లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 316బీ సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. ఆదివారం లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 7వ వార్షిక జిల్లా కన్వెన్షన్ లాస్యనందన కార్యక్రమం డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈవీవీ ఈశ్వర్‌కుమార్, లయన్ మంగాదేవి అధ్యక్షతన స్థానిక కాపు కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో నూతన డిస్ట్రిక్ట్ ఉప గవర్నర్‌గా ఎంపికైన పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ లయన్స్ ద్వారా పేదవర్గాలకు కంటి వైద్యం, క్యాన్సర్, వివిధ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు విద్యాభివృద్ధి కోసం తమవంతుగా సహాయపడతున్నామన్నారు. అనంతరం విశేష సేవలు అందించిన లయన్స్ సభ్యులను ఘనంగా సత్కరించారు. అంతక ముందు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వి.విజయకుమార్‌రాజు, డాక్టర్ ఎడ్ల అశ్లేషా, ఎస్.సూర్యనారాయణరాజు, ధూళిపూడి బాబి, దాసరి తిరుమలరావు, బీవీఎస్‌రెడ్డి, అనీల్‌షేట్, గ్రంధి వెంకటేశ్వర్లు, లింగమల్లి కృష్ణమూర్తి, బాధం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేయించండి మహోప్రభో!

ఎమ్మెల్యేకి గ్రామస్తులు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అయినాపురం గ్రామస్తులు

ముమ్మిడివరం: కాట్రేనికోన–ముమ్మిడివరం రాకపోకలు, రైతుల ఉత్పత్తులను తరలించేందుకు ప్రధాన రహదారైన అయినాపురం రహదారిని ఆధునీకరించాలని ఆయా గ్రామల ప్రజలు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుకు మొర పెట్టుకున్నారు. ఈ మేరకు గ్రామస్తులు ఆదివారం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ముమ్మిడివరం కాట్రేనికోన మండలాలను కలిపే ప్రధాన రాహదారి కావడం, ఎవరైనా అనారోగ్యానికి గురైతే కనీసం అంబులెన్స్ కూడా రాని పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి నిర్మించి దశాబ్ద కాలం పైబడినా ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదని వాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని అయితే కొన్ని అనివార్య కారాణాల వల్ల రోడ్డు ఆధునీకరణకు నోచుకోలేదన్నారు. ఇప్పుడు రోడ్డు చర్యలు తీసుకుంటానన్నారు. వినతిపత్రం అందించిన వారిలో బొంతు నాగరాజు, చిక్కాల ఆంజనేయులు,మట్టా సత్తిబాబు, రెడ్డినాని, అయ్యల రమేష్, పులిమే సత్తిబాబు, గ్రామస్తులు ఉన్నారు.

22 కేజీల నందా దీపం నిమజ్జనం

అమలాపురం నుంచి కుండలేశ్వరానికి ఊరేగింపు



వారాహి నందా దీపాన్ని ఊరేగింపుగా తీసుకుని వెళుతున్న అక్షయ పాత్ర ప్రతినిధులు, సేవకులు

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని ఆది శేష నిలయం నుంచి 22 కేజీల వారాహి నందా దీపాన్ని గౌతమ మహర్షి అక్షయ పాత్ర సంస్థ ఆధ్వర్యంలో దక్షిణ కాశీగా పేరు గాంచిన కుండలేశ్వరస్వామి దివ్య క్షేత్రానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆ దివ్య క్షేత్రం నుంచి పారే వృద్ధ గౌతమి నదిలో ఆ నందా దీపాన్ని అక్షయ పాత్ర ప్రతినిధులు, సేవకులు నిమజ్జనం చేశారు. 2024 అక్టోబర్ 31న జరిగిన దీపావళి అమవాస్య తిథి నాడు స్థానిక ఆది శేష నిలయంలో 22 కేజీల వారాహి నందా దీపాన్ని అక్షయ పాత్ర సేవకులు వెలిగించారు. నాటి నుంచి నేటి దాకా అంటే 143 రోజుల పాటు దీపం పాడవకుండా నిరంతరాయంగా వెలుగుతూనే ఉంది. అక్షయ పాత్ర ప్రతినిధులు పోతురాజు నాగ కనకదుర్గ, నూకల కుమారి, పప్పుల సుబ్బలక్ష్మి తదితరులు వారాహి దీపాన్ని ప్రత్యేక వాహనంలో ఉంచి ఊరేగింపుగా కుండలేశ్వరం దివ్య క్షేత్రం నదీ పాయకు తీసుకెళ్లి ఆదివారం రాత్రి నిమజ్జనం చేశారు. మరో వాహనంపై అక్షయ పాత్ర ప్రతినిధులు ఊరేగింపుగా వెళ్లారు. దీపాన్ని నిమజ్జనం చేసి నదిలో స్నానాలు ఆచరించారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు దీక్ష



కాట్రేనికోనలో మాల మహానాడు నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న నాయకులు

కాట్రేనికోన: మండలంలో మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేస్తున్న రిలే దీక్షలకు తాత్కాలికంగా విరామం తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం ఆమోదం తెలపడంతో దానిని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. వర్గీకరణ బిల్లుపై ప్రభుత్వం ఏక పక్షంగా వ్యవహించిందని మాల మహానాడు నాయకులు ఆరోపించారు. ముందుగా గేట్ సెంటరులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు నాయకులు చేపట్టిన దీక్షను సీనియర్ నాయకుడు నల్లా నరసింహమూర్తి, గంటి వెంకట సుధాకర్ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈకార్యక్రమంలో నల్లా నరసింహమూర్తి, గంటి వెంకట సుధాకర్, జగడం బాలయ్య, రాజేంద్ర, ఇసుకపట్ల రాంబాబు, శ్యామ్ ప్రసాద్, శరత్, శ్రీను, శ్రీను, చిన్నారావు, శ్రీను తదితరులు ఉన్నారు.

మార్కెట్ భూమి పత్రాలు ఉన్నాయి

సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు

తాళ్లరేవు: సుంకరపాలెం పంచాయతీలో తాను మార్కెట్‌కు దానం చేసిన భూమికి సంబంధించి అన్ని పత్రాలు ఉన్నాయని సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది రాజకీయంగా తనను ఎదుర్కొలేక దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఆ భూమిని ఎన్నో ఏళ్లగా కుమ్మర్లు అనుభవిస్తుండగా 1988లో ప్రభుత్వం 12 కుంచాల భూమిని తమకు రైతువారీ పట్టాలు ఇచ్చిందన్నారు. సర్వే నంబరు 125, 123లో 18 సెంట్లు, 126–5లో 102 సెంట్లు మొత్తం 12 కుంచాల భూమికి సంబంధించి పాస్‌బుక్‌లు ఉన్నాయని, పన్నులు కూడా చెల్లిస్తున్నట్టు తెలిపారు. ఆ భూముల్లో కనకాలపేట నుంచి మూడు తూముల వరకు సర్వే నంబరు 123, 125లో అనేక ఇళ్లు, వందల కొబ్బరి చెట్లు ఉండగా కేవలం 18 సెంట్ల భూమికి పత్రాలు ఇంజక్షన్ ఆర్డర్‌లో ఉండగా, తనను రాజకీయంగా ఎదుర్కొలేక కొందరు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వారికి చిత్తశుద్ధి ఉంటే ఇదే సర్వే నంబర్లలో ఉన్న ఆక్రమణలను తొలగించి, ఫెన్సింగ్ వేసి రక్షణ కల్పించాలని సర్పంచ్ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

డ్రైవర్లపై వేధింపులకు నిరసన



డిపోలో ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

అమలాపురం రూరల్: స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్లపై వేధింపులకు నిరసనగా యునైటెడ్ వర్కర్స్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. 34వ రోజు ఆదివారం గేట్ మీటింగ్‌లో నేషనల్ మజ్దూర్ యూనియన్ జోనల్ కార్యదర్శి డీఎంఆర్ రాజు, డీపో కార్యదర్శి పి.మణిరాజు మాట్లాడుతూ డిపోలో 1/19 సర్క్యులర్ అమలు చేయాలని, అక్రమంగా సస్పెండ్ అయిన డ్రైవర్ నారాయణను డ్యూటీలోనికి తీసుకోవాలని, రాజోలు నుంచి వచ్చిన డ్రైవర్ కేజీ రావు డ్రైవర్ కం కండక్టర్ డ్యూటీకి వెళ్లాలని వేధించడం మానుకోవాలని డిమాండ్ చేశారు. డిపోలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. వాటర్ ప్లాంట్ బాగు చేయించి రాబోయే వేసవి కి కార్మికులకు, ప్రయాణికులకు మంచినీటి సౌకర్యం కల్పించాలని, మరుగుదొడ్లను పరిశుభ్రతగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు వసతి రూమ్‌లు కల్పించాలని యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉప కార్యదర్శి రంగ ప్రసాద్ డిమాండ్ చేశారు. బేషరతుగా ఇద్దరు డ్రైవర్లను డ్యూటీ తీసుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో అధ్యక్షుడు హౌలియా డిమాండ్ చేశారు.

పరారైన నిందితుడిని పట్టుకున్న పోలీసులకు సత్కారం

యానాం: స్థానిక సబ్‌జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న కనకాల వెంకటేశ్వర్లు ఈనెల 22 న శనివారం మధ్యాహ్నం జైలు గోడదూకి పరారయ్యాడు. ఈ ఘటన జరిగి 24 గంటలు పూర్తి కాకముందే కాకినాడ జిల్లా అంతా విస్తృతంగా గాలించి నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకుని స్టేషన్‌కు తీసుకువచ్చిన పోలీసులను సీఐ షణ్ముగం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దేవరపల్లి సురేష్, పబ్బినీడి ఏసు, మల్లాడి గణేష్‌లను పోలీస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ సీఐ గూటం శివగణేష్ పాల్గొన్నారు.

చికిత్సకు సాయం

యానాం: రహదారి ప్రమాదాల్లో తలకు, వెన్నెముకకు గాయాలైన క్షతగాత్రులకు వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం రూ.3లక్షలు ఆర్థిక సాయాన్ని అందిస్తుందని పుదుచ్చేరి సీఎం రంగసామి ప్రకటించారు. ఆదివారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ తలకు, వెన్నెముక గాయాలకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అత్యవసర వైద్యం కోసం సహాయం చేస్తుందన్నారు. ఆవిధంగా అట్టి వారి చికిత్సకోసం వారం రోజుల్లో కేంద్రంనుంచి రూ.1.50వేలు మరో రూ.1.50లక్షలు పుదుచ్చేరి ప్రభుత్వం అందిస్తారన్నారు.

ఐకాన్ అవార్డు–2025 అందుకున్న నాని



హైద్రాబాద్‌లో అవార్డు అందుకున్న వెదురుపావులూరు నాని

తాళ్లరేవు: ఉగాది పురస్కారాలలో భాగంగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రకటించిన ఐకాన్ అవార్డు–2025ను ప్రముఖ వాస్తు, జ్యోతిష్య నిపుణుడు వెదురుపావులూరి నాని అందుకున్నారు. హైదరాబాద్ మల్కాజ్‌గిరిలోని వీఆర్ బాంకెట్ హాలులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఎస్‌పీఎఫ్ ఎస్పీ కొండా నరసింహరావు, సినీనటుడు బాలిరెడ్డి పృథ్వీరాజ్, జబర్దస్త్ ఫేమ్ రాకింగ్ రాకేష్, తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్స్ సంస్థ చైర్మన్ చింతపట్ల వెంకటాచారి చేతుల మీదుగా ఐకాన్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వారు దుశ్శాలువాతో నానిని సత్కరించి గోల్డ్ మెడల్, 2025 ఐకాన్ అవార్డ్స్ బుక్, జ్ఞాపికను అందజేశారు. తాళ్లరేవు గ్రామ పంచాయతీ శివారు శ్రీరంగనాయకపురం గ్రామానికి చెందిన నాని తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్స్ ఐకాన్ సంస్థ ఆస్ట్రాలజీ విభాగంలో ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఉగాది అవార్డును అందుకున్న నానిని పలువురు అభినందించారు.

మహాలక్ష్మి కవితకు ప్రశంసాపత్రం

అమలాపురం టౌన్: ప్రపంచ కవితా దినోత్సవం, శ్రీవిశ్వావసు నామ ఉగాది సందర్భంగా రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాజమహేంద్రవరంలోని ఆనం కళా కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అమలాపురానికి చెందిన కవయిత్రి సబ్బెళ్ల వెంకట మహాలక్ష్మికి ప్రశంసా పత్రం లభించింది. ఆమెను నగదు బహుమతితో పాటు ఘనంగా సత్కరించి అభినందించారు. శ్రీశ్రీ కళా వేదిక నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ వేదిక అంతర్జాతీయ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్, బోయి భీమన్న సతీమణి బోయి హైమావతి చేతుల మీదుగా మహాలక్ష్మి బహుమతిని, ప్రశంసా పత్రాన్ని, సత్కారాన్ని అందుకున్నారు. 500 మంది రాసిన కవితల్లో 14 కవితలను ఉత్తమంగా ఎంపిక చేయగా అందులో మహాలక్ష్మి రాసిన కవిత ఉంది. నేటి యువత అకారణంగా చిన్న చిన్న తప్పిదాలకు భయపడి ఆత్మహత్య చేసుకుంటున్న దుస్థితిపై మహాలక్ష్మి 'నల్ల గులాబి' శీర్షికతో రాసిన కవితకు బహుమతి లభించింది.

బాల్య వివాహాల నిర్మూలనపై విస్తృత ప్రచారం



నీలపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ

తాళ్లరేవు: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన చట్టంపై విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. నీలపల్లి గ్రామంలో ఐసీడీఎస్ సీడీపీఓ వి.మాధవి ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం.నళిని, కె.రమణి, క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ బి.కుమారి, మండల సీఎస్‌డబ్ల్యూ పిల్లి త్రిమూర్తులు తదితరులు మాట్లాడారు. బాల్య వివాహాల చట్టం ప్రకారం బాలునికి 21, బాలికకు 18 ఏళ్లు నిండకుండా వివాహం చేయకూడదన్నారు. చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల రక్తహీనత, శారీరక సమస్యలు, రుగ్మతలు, ఆర్థిక ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎక్కడైన బాల్య వివాహాలు జరిగితే టోల్ ఫ్రీ నంబరు 1098, 100, 112లకు సమాచారం ఇవ్వాలని, ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రతి గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

శెట్టిబలిజల సంఘ సంస్కర్త దొమ్మేటి



బోడసకుర్రులో నివాళులర్పిస్తున్న ముని మనవడు గోపాలకృష్ణ తదితరులు

అల్లవరం: శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకులు, బర్మా కేసరి అవార్డు గ్రహీత స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి శెట్టిబలిజల సంఘ సంస్కర్త అని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. అల్లవరం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో హైస్కూల్ సెంటర్లో స్వర్గీయ వెంకటరెడ్డి విగ్రహం వద్ద 172వ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, సర్పంచ్ రాయుడు విష్ణు, కడలి గంగాచలం, ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ దొమ్మేటి శ్యాంప్రకాష్, శెట్టిబలిజ నాయకులు తదితరులు పాల్గొన్నారు. బోడసకుర్రులో కూడా వెంకటరెడ్డి జయంతి నిర్వహించారు. ఆయన ముని మనవడు దొమ్మేటి గోపాలకృష్ణ, కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. గీత కులాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి రాయుడు శ్రీరామచంద్ర మూర్తి, అఖిల భారత గౌడ సంఘ అధ్యక్షుడు కోళ్ల ఈశ్వరసత్యప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయం

ముమ్మిడివరం: భూదాన, విద్యాదాన వంటి సేవా కార్యక్రమాలతో ప్రజల్లో చిరస్మరణీయంగా నిలిచిన స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. ముమ్మిడివరం టీడీపీ కార్యాలయంలో ఆదివారం దొమ్మేటి వెంకట రెడ్డి జయంతిని నిర్వహించారు. వెంకట రెడ్డి చిత్ర పటానికి ఎమ్మెల్యే దాట్లతో పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాలులర్పించారు.

అమర వీరులకు నివాళులు



భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల చిత్ర పటాలకు నివాళులు అర్పిస్తున్న నాయకులు



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

అమలాపురం టౌన్: దేశం కోసం తృణప్రాయంగా ప్రాణాలు అర్పించిన సర్దార్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లు చరిత్ర పుటల్లో నేటికీ మహనీయులుగా నిలిచారని ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమిల్లి నాగ సుధా కొండ అన్నారు. స్థానిక ముమ్మిడివరం గేటు సెంటరులో ఆ ముగ్గురి మహనీయుల వర్ధంతి కార్యక్రమం ఆజాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జరిగింది. వర్ధంతి సభలో నాగు సుధా కొండ మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లను ఉరి తీసిన రోజును అమర దినంగా ప్రకటించారని గుర్తు చేశారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, మామిడిపల్లి త్రిమూర్తులు, పాలనాటి సురేష్, తిరువూరి సతీష్ తదితరులు ఈ ముగ్గురి మహనీయుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

అమలాపురంలో...

అమలాపురం టౌన్: దేశం కోసం చిన్న వయస్సులోనే ఉరి కంబాన్ని ఎక్కి ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లను నేటి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని సమాజం కోసం ఉద్యమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు పిలుపునిచ్చారు. స్థానిక కొంకాపల్లి ఎస్సీ హాస్టల్ వద్ద ఆ ముగ్గురి అమర వర్ధంతి కార్యక్రమం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరపతిరావు హాస్టల్ విద్యార్థులతో కలసి కొవ్వొత్తులు వెలుగులతో అమర వీరులకు ఘన నివాళులర్పించారు. పీడీఎస్‌యూ నాయకులు పి.దుర్గా ప్రసాద్, జి.నాని, ఎం.రామకృష్ణ, బి.సన్నీ, ఎం.తేజతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల వర్ధంతి